
ప్రజాశక్తి
బుధవారం 10 జులై 2024
5
పార్వతీపురం మన్యం



మండల అభివృద్ధిపై నేడు ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి - కొమరాడ

మండల అభివృద్ధిపై అధికారులతో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేయనున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు తెలిపారు. ముందుగా కల్లికోటలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. అనంతరం అధికారులతో సమీక్షించనున్నట్టు తెలిపారు. కావున అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.



విమానాశ్రయ పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహననాయుడు

11న సిఎం రాక

- భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పరిశీలించనున్న చంద్రబాబు
- వెల్లడించిన కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి-భోగాపురం

ఈ నెల 11న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు రానున్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులను పరిశీలించనున్నారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాంతంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 1.30 వరకు నిర్మాణ పనులను పరిశీలించి, సమీక్షిస్తారు. ఈ నేపథ్యంలో కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మంగళవారం భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాంతంలో పర్యటించారు. జిఎంఆర్ సంస్థ చేపడుతున్న ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు లోకం మాధవి, అదితి గజపతిరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిఎంఆర్ సంస్థ ప్రతినిధి రామరాజు ఈ పనులకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఇప్పటి వరకు 25 శాతం పనులు జరిగాయని తెలిపారు. ఎటిసి టవర్ నిర్మాణం చివరి దశలో ఉన్నట్లు వివరించారు. టెర్మినల్, రన్‌వే పనులను సైతం కేంద్రమంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11న సిఎం చంద్రబాబు భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తారని చెప్పారు. భూసేకరణలో గత ప్రభుత్వ హయాంలో కొన్ని తప్పులు జరిగాయని స్థానిక నాయకులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు ఒక నిర్ణయం తీసుకుంటార న్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అంబేద్కర్, జెసి కార్తిక్, ఆర్‌డిఒ సూర్యకళ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, నాయకులు కర్రోతు సత్యనారాయణ, కాకర్లపూడి శ్రీనివాసరాజు, కంది చంద్రశేఖర్, మట్టా అయ్యప్పరెడ్డి, బాల అప్పలరాజు, పతివాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి మండలం శివ్వాంలో దళిత రైతులపై వారు సాగు చేసుకుంటున్న భూముల్లోనే దాడి చేసి గాయపరిచిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష పోరాట, వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్లో డిఆర్‌ఒకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివ్వాం గ్రామంలోని దళితులకు 1970లో ప్రభుత్వం 22.80 ఎకరాలకు డి-పట్టాలను ఇవ్వగా అప్పటి నుంచి వారు సాగు చేసుకుంటున్నారని అన్నారు. సర్వే నెంబరు 20 నుంచి 30 వరకు సదరు పట్టాలకు చెందిన భూమి ఉన్నట్లుగా సర్వే రికార్డులు స్పష్టంగా చూపిస్తున్నాయని అన్నారు. అదే రెవెన్యూలో సర్వేనెంబర్ 102కు ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చిన ఆ గ్రామ పెద్దలు దళితుల భూమిలోనే ప్రవేశించి, వారి పనులకు అడ్డుతగిలారు. ఇదేమి అన్యాయమని అడిగిన దళితులను కులం పేరుతో దూషిస్తూ వారిపై హింసకు దిగారు. ఈ సంఘటన సాక్షాత్తూ పోలీసులు ఎదుటే జరగడం విశేషం. అయినప్పటికీ పోలీసులు తిట్టిన వారి సమక్షంలోనే దాడి చేసి కొట్టిన పెత్తందారులను ఇంతవరకు అదుపులోకి తీసుకుపోవడం గాని, అరెస్టులు చేయడం గాని జరపలేదని ఆరోపించారు. ఎంత జరిగినా గరుగుబిల్లి తహశీల్దార్ ఈ సమస్యపై కనీసం స్పందించకపోవడం ఘోరమని అన్నారు. ఈ భూమిని సర్వేయర్లు సర్వే చేయగా ఇంజక్షన్ తెచ్చిన భూమి 102 సర్వేనెంబర్ అని, దళితులు సాగు చేసుకుంటున్న భూమి 20 నుంచి 30 సర్వేనెంబర్లు ఉందని తేల్చారన్నారు. పాత ఎస్ఎఫ్ఎ పరిశీలించగా, దానిలో అసలు 102 సర్వే నంబర్ లేనేలేదని తేలిందన్నారు. పాత ఎస్ఎఫ్ఎలో సర్వే నెంబర్లు 20 నుండి 30 వరకు మధ్య ఉన్న భూమి 44, 45 లో ఉన్నట్లు రికార్డులు ఉన్నాయని, ఎస్ఎఫ్ఎలోను వన్-బిలోను దళితులకు హక్కులు ఉన్నప్పటికీ తహశీల్దార్ శివ్వాం పెత్తందారులు వైపునే మాట్లాడుతు న్నారని అన్నారు. దళితులకు హక్కులున్నప్పటికీ వారికి న్యాయం చేయడం లేదని, ఇటువంటి వారి చర్యల వల్ల జిల్లా రెవెన్యూ అధికారుల చిత్తశుద్ధిని శంకించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అలాగే పార్వతీపురం మండలంలో గిరిజన గ్రామాలైన తానవలస, తొక్కుడు వలస, పనసభద్ర, సీతంపేట, ధోనిగెడ్డవలస, ములగవలస, సందివలస, వెలగవలస, పిండిలోవా, బిళ్లగుడ్డివలస, లక్ష్మిదొర వలస తదితర గ్రామాల్లో గిరిజన రైతులు ఇదే సమస్యలను ఎదుర్కొంటు న్నారని భవిష్యత్తులో వారిపై ఇలా దాడికి దిగే అవకాశాలు ఉన్నందున ఈ విషయంలో జిల్లా కలెక్టరు, రెవెన్యూ అధికారి కలగజేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి దళితులపై దాడికి దిగిన వారిని వెంటనే అరెస్టులు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి వేణు, గిరిజన సంఘం నాయకులు బి.రాము, మచ్చ పకీరమ్మ, రేగిడి ఎల్లయ్య, తిర్లంగి లక్ష్మణరావు, రేగిడి అప్పలస్వామి, శంకర్రావు, జ్యోతి, కారు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు



ఉచిత ఇసుకను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్ర ప్రగతికి బాట : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం వల్ల నిర్మాణ రంగంలో గణనీయమైన ప్రగతి కనిపిస్తుందని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి జి.సంధ్యారాణి చెప్పారు. మంగళవారం ఆమె మండలంలోని శివరాంపురంలో ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సిఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే అమలు చేశారని చెప్పారు. ఈ విధానం వల్ల బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తుందన్నారు. నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నది ప్రభుత్వ విధానమని చెప్పారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియాను నడిపిందని ఆరోపించారు. ఒక్క ఇసుక కుంభకోణం ద్వారా రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని చెప్పారు. వైసీపీ నేతలే స్వయంగా ఇసుకాసురుల అవతారం ఎత్తి దోచుకున్నారని విమర్శించారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి నానా అవస్థలు పడ్డారని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పరమేష్, నాయకులు మత్స శ్యామ్ కుమార్, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

అక్రమ వసూలు ఆపాలి : యుటిఎఫ్

పార్వతీపురం రూరల్ : సమాచార హక్కు పేరుతో బెదిరిస్తున్న దళారీలకు డబ్బులు ఇవ్వాలంటూ ఉపాధ్యాయుల నుంచి ఎంఇఒలు చేస్తున్న డబ్బులు వసూళ్లను వెంటనే ఆపాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు పేరుతో కొంత మంది దళారీలు, ఎంఇఒలు ఉపాధ్యాయుల నుండి డబ్బులు వసూలు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్‌తో పాటు సమాచార హక్కు రాష్ట్ర కమిషనర్‌కు కూడా ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస ఎంఇఒలు వేలాది రూపాయలు సిఆర్‌పిల ద్వారా ఫోన్ పేల ద్వారా వసూళ్లు చేస్తున్నట్లు ఆధారాలు ఉన్నాయని అన్నారు. కావున కలెక్టర్ స్పందించి ఎంఇఒలపైనా, సదరు దళారీలపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. వినతిని అందజేసిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి రమేష్ తదితరులు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాల అమలుపై

నేడు తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి, హక్కులను కాలరాయడానికి ప్రయత్నిస్తుందని, ఇందుకు నిరసనగా సిఐటియు పిలుపులో భాగంగా జిల్లాలో గల అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద బుధవారం నిరసన చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దావాల రమణారావు, యమ్మల మన్మధరావు, జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానంగా ప్రభుత్వ సంస్థలను అమ్మేయడమే ప్రధానమైన లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. అలాగే ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, డిఫెన్స్, రైల్వే ఇలా ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను, లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి తీవ్ర ప్రయత్నం చేయడం దారుణమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీలకు, ఆశాలకు, మున్సిపల్, కాంట్రాక్టు, ఆప్కాస్ ఉద్యోగులకు జీతం పెంచుతామని హామీ ఇచ్చిందని, ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆటో, హమాలీ, తోపుడు, బిల్డింగ్, తదితర అసంఘటిత కార్మికులు, కాంట్రాక్టు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గుడారివలసలో ఐఎఫ్ఎస్ అధికారుల పర్యటన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఇద్దరు ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు చెందిన అధికారులు తమ మిడ్ కెరీర్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుడారివలసలో మంగళవారం పర్యటించారు. కొలంబోలోని భారత డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ సత్యంజల్ పాండే, 2008 బ్యాచ్‌కు చెందిన ఎంఇఎ డైరెక్టర్ విఎస్‌డిఎల్ సురేంద్ర మంగళవారం పార్వతీపురం చేరుకున్నారు. విడివికెల లబ్ధిదారులు, అభిలాష లైబ్రరీల వినియోగదారులతో వారు సంభాషించారు. లబ్ధిదారులు ఆయా రంగాల్లో వ్యవహరిస్తున్న తీరును వివరించారు. గ్రామంలో అధికారులకు సంప్రదాయ స్వాగతం పలికారు. అంతకుముందు వారు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్‌తో మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. అభిలాష లైబ్రరీలు, ఇన్నోవేటివ్ హబ్, జన్మాన్, వన్ ధన్ వికాస్ కేంద్రాలు, మై స్కూల్, మై ప్రైడ్ గురించి ఐటిడిఎ పిఒ వివరించారు. ఒక జిల్లా ఒక వస్తువును ఉత్పత్తి చేయనప్పుడు దాని చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన ఉత్పత్తిగా అభివృద్ధి, ప్రచారం చేయాలని డాక్టర్ సత్యంజల్ పాండే సూచించారు. స్థానిక ఉత్పత్తులు కారణంగా దేశంలోని ఇతర ప్రాంతాలతో పాటు విదేశాల్లో ఈ ప్రాంతం గుర్తించబడుతుంది. ఉత్పత్తులను మార్కెట్ చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవనాయుడు, ఆర్‌డిఒ కె.హేమలత, ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, జిసిసి డిఎం వి.మహేంద్ర కుమార్, డిఆర్‌డిఎ పిడి వై.సత్యంనాయుడు పాల్గొన్నారు.

హామీల అమలుపై కేలండర్ విడుదల చేయాలి

ఎఎన్ఎంల నియామకానికి వైసిపి ప్రభుత్వంలో చర్యలు
మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

గత ఎన్నికల ముందు టిడిపి ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తుందో కేలండర్ విడుదల చేయాలని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబు నాయుడు సంపద సృష్టించి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారని, ఆ పార్టీ నాయకులు చెప్పారని తెలిపారు. ఎప్పుడెప్పుడు ఏ పథకం అమలు చేయనున్నారో కేలండర్ ప్రకటించాలని కోరారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నవరత్నాల పథకాలను ఏ నెలలో ఏది అమలు చేస్తామో అప్పటి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కేలండర్ విడుదల చేశారని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇంతవరకు ఒక్క పింఛను మాత్రమే అమలు చేశారని, మిగిలిన పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. గతంలో తమ ప్రభుత్వం ఏడాదికి పథకాల కోసం రూ.70వేల కోట్లు ఖర్చు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని సిఎం చంద్రబాబు నాయుడు విమర్శించారని చెప్పారు. ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలు ఏడాదికి రూ.లక్షా 60వేల కోట్లు అవసరమని చెప్పారు. ఈ పథకాలన్నీ అమలు చేస్తే రాష్ట్రం ఏమవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ మొదలైందని, రైతులు భరోసా డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు దాటినా ఇంతవరకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ మంజూరు కాలేదని చెప్పారు. విద్యాకానుక కూడా అమలు చేయలేదని అన్నారు. ఎన్డీఎ కూటమి ప్రభుత్వంలో టిడిపి ఉన్నందున, ఒడిశాలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున కొటియా గ్రామాల వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. గతంలో కొటియా గ్రామాల్లో ఎపి అధికారులు అభివృద్ధి పనులు చేస్తే ఒడిశా అధికారులు, పోలీసులు అడ్డుకున్నారని, ఇప్పుడు ఒడిశా ప్రభుత్వం ఆ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తోందని చెప్పారు. గిరిజన యూనివర్సిటీని కొత్తవలస తీసుకెళ్లడానికి కొంత మంది టిడిపి ఎమ్మెల్యేలు పావులు కదుపుతున్నారని, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అలా జరగకుండా అడ్డుకోవాలని కోరారు. గతంలో గిరిజన యూనివర్సిటీని సాలూరు ప్రాంతానికి తీసుకురాలేదని సంధ్యారాణి విమర్శించారని, ఇప్పుడు ఆమె మంత్రిగా ప్రయత్నించాలని కోరారు.

ఎఎన్ఎంల నియామక ఫైల్ తానే పెట్టించా

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకానికి సంబంధించి ఫైలును తాను మంత్రిగా ఉన్న సమయంలోనే సిఎం వద్దకు పంపించినట్లు చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాక ముందే మన్యం జిల్లాలో ఇద్దరు గిరిజన విద్యార్థులు మరణించారని చెప్పారు. వర్షాలు విరివిగా పడుతున్న కారణంగా జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని అన్నారు. వెంటనే ఎఎన్ఎంల నియామకానికి చర్యలు తీసుకోవాలని రాజన్నదొర కోరారు.

భావితరాల మనుగడకు మొక్కలు నాటండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

భావితరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతలు చేపట్టాలని, పచ్చదనంతోనే పర్యావరణానికి రక్షణ అని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం పట్టణంలో జగన్నాథపురంలోని రాధంపేటలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, అభిమానులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే విజయ్‌చంద్ర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో వాయు, నీటి, శబ్ద కాలుష్యం రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, దీని కారణంగా ప్రస్తుత సమాజంతో పాటు భవిష్యత్తు సమాజంలో జీవించే ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం ఉండే పరిస్థితి ఉండదని, అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటికి సంరక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ధరల నియంత్రణకు ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో నిత్యావసర సరుకులైన బియ్యం, కంది పప్పు ధరలు నియంత్రణకు జిల్లాలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖలు, రైస్ మిల్లర్లు, హెూల్ సేల్, రిటైల్ డీలర్లతో ధరల నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు స్థిరమైన ధరలకు నిత్యావసర వస్తువులను సరఫరా చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మొదటి దశగా, వినియోగదారులకు స్థిరమైన ధరలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచడానికి జిల్లాల్లో విస్తృత సంప్రదింపులు జరిగాయని ఆయన అన్నారు. రెడ్‌గ్రామ్ పప్పు (దేశావళి రకం), బిపిటి / సోనామసూరి ఫైన్ రైస్ (స్టీమ్డ్), బిపిటి / సోనా మసూరి ఫైన్ రైస్ (ముడి) బహిరంగ మార్కెట్లో రూ.181, రూ.55.85, రూ.52.40 ధరలు ఉంటే ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కౌంటర్లులో రూ.160, రూ.49, రూ. 48కే విక్రయించినట్లు తెలిపారు.

ప్రత్యేక కౌంటర్లలో దేశావళీ రకం రెడ్‌గ్రామ్ పప్పు కిలోకు రూ.160, బిపిటి లేదా సోనామసూరి స్టీమ్డ్ రైస్ రూ.49, ముడి బియ్యం రూ.48 అని స్పష్టంగా చూపే బ్యానర్లను ప్రదర్శించాలని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక కౌంటర్లలో అమ్మిన పరిమాణం, లబ్ధిదారుల సంఖ్య, రోజువారీ ధర వివరాలను చూపించే రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. కౌంటర్ల ద్వారా మంచి నాణ్యమైన సన్న బియ్యం, ఆర్జీ పప్పు మాత్రమే విక్రయిస్తామని అన్నారు. పెద్ద చైన్ రిటైలర్ దుకాణాల్లో కూడా బ్యానర్ల ప్రదర్శన, ఆర్జీ పప్పు, బియ్యం నాణ్యత, ధరలను ప్రదర్శించడం, నిల్వలు, అమ్మకాలు, ఇతర అవసరమైన ఏర్పాట్లపై సరైన పర్యవేక్షణ కోసం చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ప్రత్యేక కౌంటర్లను సందర్శించి, విక్రయాలను పర్వేక్షణతో పాటు ఆర్‌జి పప్పు, బియ్యం విక్రయాల రోజువారీ నివేదికను సమర్పిస్తారని చెప్పారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుపై విస్తృత ప్రచారం కల్పించడానికి, అమలు చేయడానికి, విజయవంతంగా, సజావుగా నిర్వహించేలా అన్ని చర్యలను తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో డిఎస్ఒ కె.శివప్రసాద్, మార్కెటింగ్ శాఖ అధికారి ఎల్.అశోక్ కుమార్, రైస్ మిల్లర్స్, హెూల్ సేల్, రిటైల్ వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.



అచ్చిబ గ్రామ గిరిజనులతో మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి శాంతి ప్రభ

జ్వరాల నియంత్రణకు సమిష్టి కృషి

ప్రజాశక్తి - సీతంపేట

సీజనల్ జ్వరాలు ప్రబలకుండా సిబ్బంది సమిష్టి కృషి చేయాలని జోనల్ మలేరియా అధికారిణి డాక్టర్ ఎం. శాంతి ప్రభ అన్నారు. గిరిశిఖర గ్రామమైన అచ్చిబ గ్రామాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఆమెతో పాటు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహన్ రావు పాల్గొని గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న తీరు, నివారణ చర్యలపై సిబ్బందిని ఆరా తీశారు. దోమల నియంత్రణకు డ్రైడే, పారిశుధ్య కార్యక్రమాలు ఏ మేరకు చేపడుతున్నారో పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి ఎవరికైనా జ్వరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జి మండలంలోని వెన్నెలవలస ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న అచ్చిబకు చెందిన విద్యార్థిని మలేరియాతో మరణించిందన్న సమాచారం మేరకు పాప తల్లిదండ్రులు, సిబ్బందితో మాట్లాడారు. ఆమె మరణానికి గల కారణాలపై విశ్లేషించారు. పాప తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం హాస్టల్‌లో ఉండగా పాపకు జ్వరం వచ్చిందని, సంబంధిత వైద్య సిబ్బంది పరీక్షలు జరిపి మెరుగైన వైద్యచికిత్స కోసం శ్రీకాకుళం, జిజిహెచ్ లో చేర్చారని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ పర్యటనలో జోనల్ ఏడి ఎస్ఎస్. ప్రసాదరావు, ఎఎంఒ సూర్యనారాయణ, కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్ యూనిట్ అధికారి మోహనరావు, ఎంటిఎఎస్ ఝాన్సీరాణి, సూపర్వైజర్ మూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో మెరిట్ కార్డులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)లో ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులు విద్యార్థులకు అందుబాటులో జాప్యం జరుగుతున్న కారణంగా ఈ ఏడాది వెబ్ మెరిట్ కార్డులను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉంచామని సదర ఫలితాలను వెబ్సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని డిఇఒ జి.పగడాలమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వెంటనే వెబ్సైట్ నుంచి వారి మెరిట్ కార్డ్ డౌన్లోడ్ చేసుకుని వారి పేరు, పుట్టిన తేదీ, తండ్రి లేదా తల్లి పేరు మొదలగు వివరాలు వారి ఆధార్ కార్డ్‌పైన ఉన్న విధంగానే (ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా) ఉన్నవో లేదో తనిఖీ చేసుకుని విద్యా మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారి స్కాలర్షిప్ పోర్టల్ www.scholarships.gov.inలో ఈ సంవత్సరం ఆగస్టు 31 లోపు దరఖాస్తు సమర్పించి, సంబంధిత పాఠశాల నోడల్ ఆఫీసర్, జిల్లా నోడల్ ఆఫీసర్ లాగిన్‌ల ద్వారా అప్రూవ్ చేయించుకోవాలని సూచించారు.

ముద్రించిన మెరిట్ కార్డ్‌లను త్వరలో డిఇఒ కార్యాలయానికి పంపుతున్నట్టు తెలిపారు. విద్యార్థి, తండ్రి పేర్లు, పుట్టిన తేదీ మెరిట్ కార్డులో ముద్రించబడిన విధంగా మాత్రమే ఆధార్ కార్డ్‌లో ఉండాలన్నారు. వివరాలు సరిపోలని విద్యార్థులు వెంటనే ఆధార్ మిస్‌మేచ్ వివరాలు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా డిఇఒకు అందజేయాలన్నారు. తప్పని సరిగా విద్యార్థి ఆధార్ విద్యార్థి బ్యాంక్ ఖాతాకు సీడ్ కాబడి, డిబిటి ద్వారా నగదు జమ అయ్యేలా ఏర్పాటు చేసుకోవాల్సిందిగా డిఇఒ తెలిపారు.

బైకు బోల్తా.. ఒకరు మృతి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మక్కువ-చెముడు రహదారిలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈసంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ-చెముడు రహదానిలో మంగళవారం రాత్రి జగనన్న కాలనీ సమీపాన జరిగిన బైక్ ప్రమాదంలో వైపు ద్విచక్ర వాహనంపై లచ్చిపాత్రుని శ్రీరామ్(36), గోరజాన వెంకట నాయుడు (62) వెళ్తాన్నారు. మక్కువ వద్ద జగనన్న కాలనీ సమీపాన వీరి బైక్ బోల్తా పడింది. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంటనాయుడు మృతి చెందారు. శ్రీరామ్ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది



సంఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు



నిడగల్లు గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

చేయూత డబ్బులు ప్రభుత్వం చెల్లించాలి


ప్రజాశక్తి - సీతానగరం

చేయూత డబ్బులు మహిళలకు ప్రభుత్వం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని మంగళవారం నిడగల్లు సచివాలయం వద్ద మహిళలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 ఏళ్ల నుంచి 60ఏళ్ల మధ్య గల మహిళలకు ప్రభుత్వం రూ.18,750 గత ప్రభుత్వం చెల్లించాలని ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొంతమందికి డబ్బులు చెల్లించి, మరికొంతమందికి రాలేదని తక్షణమే ప్రభుత్వం స్పందించి మహిళలకు డబ్బులు చెల్లించాలని ఆయన కోరారు. అనంతరం పంచాయతీ సెక్రెటరీ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ మహిళలు పాల్గొన్నారు.

పక్క రాష్ట్రం స్పందిస్తున్నా... మన వారి జాడి ఏదీ?

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు రహదారి రోజు రోజుకు మరింత అధ్వాహ్నంగా తయారైందని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మంగళవారం కొమరాడలో ఏర్పడిన గోతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రాలో అధ్వానంగా మారిన రహదారిపై ఏర్పడిన గోతులను ఒడిస్సా లారీ అసోసియేషన్ సభ్యులు ప్రతిసారి కప్పుతున్నారు తప్ప మన రాష్ట్ర అధికారులు గానీ, స్వచ్ఛంద సేవా సంస్థలు గానీ స్పందించకపోవడం చాలా దారుణం అని అన్నారు. బుధవారం ఒడిశాలోని రాయగడ లారీ అసోసియన్ ఆధ్వర్యంలో అంతరాష్ట్ర రహదారిపై చెరువుల్లా మారిన పెద్దపెద్ద గోతులను కప్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో అధికారులు అంచనా నివేదిక సిద్ధం చేసినప్పటికీ నిధుల కొరతతో పనులు చేసేందుకు ముందుకు రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు కేటాయించి తక్షణమే రోడ్డు మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు.



పల్లా శ్రీనివాసరావును సన్మానిస్తున్న వీరేష్ చంద్రదేవ్

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన వీరేష్

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ మంగళవారం విశాఖపట్నం టిడిపి పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుస్సాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపాశారు. అనంతరం నియోజకవర్గంలో గల ప్రధాన, దీర్ఘకాలిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, పరిశీలకులు అరేటి మహేష్, ఎంపిపి బొంగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చబను సందర్శించిన ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన అచ్చబను మండల విస్తరణాధికారి కొండపల్లి సత్యం మంగళవారం సందర్శించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన బిడ్డిక రిష్మిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. గ్రామంలోని విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని, 36 కుటుంబాలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ముందుగానే స్ప్రేయింగ్ ఫాగింగ్ జరిగిందన్నారు. పారిశుధ్యం మెరుగ్గా ఉందన్నారు. దోమతెరలు ఉపయోగించుకోవాలని అవగాహన కల్పించారు.. బావుల్లో మంచినీటి పథకం వద్ద క్లోరినేషన్ చేయించారు. అప్రమత్తంగా ఉండాలని గిరిజనులకు తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో వైద్య పరీక్షలు సేకరించారు. రక్త పూతల సేకరించారు. వైద్యాధికారి వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు సలహా ఇచ్చారు.ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాపారావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివిలో వైద్య శిబిరం

భామిని : సరైన పోషణ, పరిసరాలు, వ్యక్తి గత శుభ్రత పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని భామిని ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యులు వి.సంతోషలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కెజిబివి పాఠశాలలో వైద్య సిబ్బంది విద్యార్థినిలకు జ్వర పరీక్షలు, హీమో గ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. పోషణ, పరిసరాల శుభ్రత, మెనుస్ట్రియల్ దశలో అమ్మాయిలు పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, వెన్ను సంబంధిత వ్యాధిపై పిల్లలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిహెచ్ఒ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహన చోదకులకు నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండి ట్రాఫిక్ నిబంధనలు పాటించి మద్యం సేవించకుండా వాహనాలు నడపాలని స్థానిక ఎస్సై షణ్ముఖరావు సూచించారు. మంగళవారం కురుపాంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్స్, సి-బుక్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి అపరాధ రుసుం వేశారు. అనంతరం వాహనచోదకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

ప్రజాశక్తి - పాచిపెంట

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, గ్రామాభివృద్ధికి సహకరించాలని మండలంలోని పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ కోరారు. మంగళవారం పాంచాలిలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలని కోరారు. గ్రామంలో తాగునీటి సరఫరా పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మన ఇంటి నివాసాలు మన ఇంటి చుట్టూ పక్కల పరిశుభ్రత చాలా అవసరమని ఇలా గ్రామాన్ని ఉంచుకోవడం వల్ల రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పడొచ్చని అన్నారు. శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సహకారంతో గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పి.ఉమామహేశ్వరరావు, చల్ల తిరుపతి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ యుగంధర్

వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వ్యవసాయ సిబ్బంది రైతులకు అవసరమైన సేవలందించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం తన కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ పనుల కాలంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఎటువంటి సెలవులను అనుమతించమని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు సంభవిస్తే ఎదుర్కోడానికి అవసరమైన తాత్కాలిక కార్యాచరణ ప్రణాళికను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మట్టి నమూనాలను బట్టి పంటలను వేసేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సేవలను ఉపయోగించుకోవాలని, తద్వారా తక్కువ ఎరువులు వినియోగించి ఎక్కువ దిగుబడిని పొందవచ్చునని తెలిపారు. రైతుల అవసరాలు, వారి కోరిన విత్తనాలకు ఇండెంట్‌ను సిద్ధం చేయాలని ఆయన చెప్పారు. చిరు ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రచారం చేయాలని వీటి సాగు ప్రోత్సాహానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉద్యానవన పంటలకు సరైన పంట నిర్వహణ చేపట్టాలన్నారు. రైతులకు మంచి దిగుబడి రావడానికి ఉద్యానవన అధికారులు కృషి చేయాలన్నారు. గిరిజన రైతులపై ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు. రైతుల్లో అవగాహన కల్పించి, పూర్తి సమాచారంతో కరపత్రాలు అందించాలన్నారు. ఈ ప్రాంతంలో జీడిపప్పు, పామాయిల్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించడానికి, ఉద్యానపంటల్లో పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు ఉపాధిహామీ చట్టంతో అనుసంధానం చేయాలని తెలిపారు. గ్రామంలో జనాభాతో సంబంధం లేకుండా ప్రతి ఇంటికి తాగు నీరందించేందుకు కృషి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. కొనసాగుతున్న ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత సమయానికి పనులు పూర్తి కావాలన్నారు. పనులు పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనుల నాణ్యతలో రాజీ ప్రసక్తే లేదన్నారు. అమృతసరోవర్ చెరువులు ఆహ్లాదానికి ప్రతి రూపంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా మత్స్యశాఖ అధికారి వి. తిరుపతయ్య, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎస్.మన్మధరావు, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వి.రాధాకష్ణ, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఓ.ప్రభాకర రావు, డిపిఒ బి. సత్యనారాయణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు జె.శాంతీశ్వరరావు, సింహాచలం, ఆర్ అండ్ బి జిల్లా అధికారి ఎం జేమ్స్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గిరిజన వర్సిటీ సాలూరులో ఏర్పాటు చేయాలి

మంత్రి సంధ్యారాణిని కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన యూనివర్సిటీని సాలూరులో ఏర్పాటు చేయాలని జనసేన నాయకులు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో పలు సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ఆమెను కలిశారు. జనసేన నాయకులు శివకృష్ణ ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిశారు. సాలూరు మండలం కురుకుట్టి, పాచిపెంట మండలం వేటగానివలస, మక్కువ మండలం దుగ్గేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సాలూరు నుంచి పాచిపెంట మీదుగా అరుకు వరకు రైల్వే మార్గం నిర్మించాలని కోరారు. సాలూరు నుంచి విశాఖకు రైలు బండి నడిపేలా చూడాలని కోరారు. అంతరాష్ట్ర వాహనాలు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణానికి వెలుపల ఉన్న ఆటోనగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

పెద్దపొల్ల ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దపొల్ల బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు మంగళవారం సందర్శించారు. విద్యార్థులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల గదులను క్షుణంగా పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. ప్రభుత్వం అందించిన విద్యా రాయితీలను ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని విద్యార్థులను ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎంఒ కోటిబాబు, జిసిటిఒ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలు ఘనత చంద్రబాబుదే

ప్రజాశక్తి -పాలకొండ

ఉచిత ఇసుక విధానం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేనని టిడిపి నియోజకవర్గ ఇన్-ఛార్జ్ పడాల భూదేవి అన్నారు. మంగళవారం ఒక ప్రైవేటు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. హామీల్లో ఒకటైన ఉచిత ఇసుక పాలసీ తీసుకుని రావడం వల్ల 40లక్షల మంది భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులకు మేలు చేకూరుతుందన్నారు. ఉచిత ఇసుక విధానం రావడం వల్ల నిర్మాణాలు కూడా ఊపందుకుంటాయన్నారు. ఈ విధానం వల్ల వినియోగదారులు లేబర్, రవాణా ఛార్జీలు భరించాల్సిందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో పర్యావరణానికి తూట్లు పొడిచి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు కొనసాగించారని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కండాపు వెంకటరమణ, కోటదుర్గ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శాసపు సర్వారావు, గుమ్మిడి సింహాద్రి, శాసుపల్లి బుజ్జి, గణేష్, జీవరత్నం, శ్రీనివాస్ రావు, బిడ్డిక జయలక్ష్మి, ముంజేటి త్రినాధ రావు, బిజెపి నాయకులు టంకాల దుర్గా రావు, తదితరులు ఉన్నారు.

కనిపించని టిడిపి కేడర్

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పడాల భూదేవి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి కేడర్ దూరంగానే ఉంది. గతం నుంచి కూడా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు మద్దతుగా టిడిపిలో ఒక గ్రూపు ఉంది. వీరంతా భూదేవికి మొదట నుండి వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. ఇన్‌ఛార్జ్‌గా భూదేవి తమకు వద్దంటూ ఇటీవలే తీర్మానాలు చేసి నారా లోకేష్‌కు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు పంపిన విషయం తెలిసిందే. విలేకరుల సమావేశానికి మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు, పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. ఏదేమైనా రోజు రోజుకు విభేదాలు ముదిరపాకాన పడుతున్నాయి.

భామిని : ఇచ్చిన మాట ప్రకారం ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం అతనిలో స్వపరిపాలన పట్ల నిబద్ధతను తెలియజేస్తుందనిమండల టిడిపి అధ్యక్షులు బి.రవినాయుడు తెలిపారు. బాలేరులోని టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఉచిత ఇసుక విధానం వల్ల భవన నిర్మాణ కార్మికులకు నిరంతరం ఉపాధి లభిస్తుందని, ప్రతి పేదవాడి సొంత గూడు కట్టుకోడానికి ఇక ఇసుక సమస్య లేదని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్కులోని కంపోస్టు నిర్వహణను పరిశీలిస్తున్న మున్సిపల్ ఆర్‌డి నాగరాజు

తాగునీరు, పారిశుధ్యం దృష్టి పెట్టాలి : ఆర్‌డి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తాగునీరు సరఫరా, పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నాగరాజు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆయన కమిషనర్ కె.శ్రీనివాస్, ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగం అధికారులు, వార్డ్ సచివాలయాల శానిటరీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిపించాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని, బురద నీరు సరఫరా జరగకుండా చర్యలు చేపట్టాలని, అపార్ట్మెంట్లలో హెూమ్ కంపోస్టు జరిగేలా అవగాహన కల్పించాలని, సీజనల్ వ్యాధులు ప్రభలకుండా సచివాలయం హెల్త్ సెక్రటరీ ద్వారా పట్టణ ప్రజలకు పరీక్షలు చేయించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం బెలగాంలో చర్చి వీధిలో ఉన్న మున్సిపల్ పార్క్‌లో కంపోస్ట్ నిర్వహణను పరిశీలిస్తూ, అన్నా క్యాంటీన్ భవనాన్ని పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. 30 వార్డుల్లో కాలువల ద్వారా వాడుక నీరు వెళ్లే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో డిఇ కిరణ్ కుమార్, ఎఇలు జి.ఆనంద్, సన్యాసిరావు, ప్రజారోగ్యవిభాగం అధికారి సిహెచ్.మురళి, డ్రైవింగ్ ఇన్స్పెక్టర్లు పి.నారాయణరావు, జి.వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం బోనెల

పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రవి, వెంకటేష్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తారన్నారని పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు గుంట్రెడ్డి రవికుమార్, మజ్జి వెంకటేష్ అన్నారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర జన్మదినోత్సవం సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ..

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం యువ నాయకులను ప్రోత్సహిస్తూ ముందుకు వెళ్తుంది. ఇందులో భాగంగా మన నియోజకవర్గ ఎమ్మెల్యే విజయ్‌చంద్ర నాయకత్వంలో యువకులమంతా కలిసి పార్వతీపురం పట్టణాన్ని అభివృద్ధికి కంకణం కట్టుకుంటాం. రానున్న ఐదేళ్లలో బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ అన్న నినాదాన్ని రుజువు చేసి చూపిస్తాం. విద్య వైద్యం, పేదరిక నిర్మూలించి, అభివద్ధి కార్యక్రమాలతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగుల అవకాశాలను కల్పించేలా ఎమ్మెల్యే విజయ్‌ చంద్ర బాటలో మేమంతా నడుస్తాం. నేడు ఎమ్మెల్యే పుట్టినరోజు ప్రజా సేవా కార్యక్రమాలతో శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం.





లోపాలను గుర్తించేందుకే సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఉపాధిహామీ పథకం పనుల్లో లోపాలను గుర్తించేందుకు సామాజిక తనిఖీలను నిర్వహిస్తున్నట్టు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె రామచంద్రరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పథకం పనులపై 18వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీడీ రామచంద్రరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం సభ్యులు లోపాలను గుర్తిస్తే సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేస్తున్నామన్నారు. పలు గ్రామపంచాయతీల నుండి ఉపాధిహామీ కార్యాలయానికి వేతనదారుల వేలిముద్రలు లేకుండా మస్తర్లు రావడాన్ని గుర్తించారు. దీనిపై రామచంద్రరావు మాట్లాడుతూ ఇకపై వేతనదారులకు సంబంధించిన పూర్తి సంతకాలు, వేలిముద్రలతో కార్యాలయానికి మస్తర్లు అందజేయాలని క్షేత్రసహాయకులను ఆదేశించారు. అదేవిధంగా పలు గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల్లో కొలతలు స్వల్ప తేడాలున్నట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించి ప్రజా వేదికలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పూర్తి సమాచారంతో మస్తర్లను ఉపాధిహామీ కార్యాలయానికి అందజేయాలని, లేకుంటే క్షేత్ర సహాయకులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలుచోట్ల పండ్ల తోట్ల పెంపకానికి సంబంధించి వేసిన మొక్కలు లేని విషయాన్ని సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో గతంలో వేసిన మొక్కలు లేని కారణంగా ప్రస్తుతం మొక్కలు వేసేందుకు చర్యలు చేపట్టకపోతే సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేయనున్నామన్నారు. వీటితో పాటు మరణించిన వ్యక్తులకు పెన్షన్ మంజూరు చేయడంపై సంబంధిత ఉద్యోగుల వద్ద నుండి రికవరీకి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, డ్వామా ఎపిడి జి.శ్రీహరిరావు, ఎంపిడిఒ పైల సూర్య నారాయణ, ఎపిఒ మండల గౌరీనాథ్, టంకాల రామకృష్ణనాయుడు, సామాజిక తనిఖీ బృందం ఎస్‌ఆర్‌పి బూక దాసు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం ప్రాంతంలో గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణంతోనే ప్రజలకు మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని రెల్ల నుండి కొత్తవలసకు రూ.కోటీ 45 లక్షలతో మంజూరైన 1.5 కిలోమీటర్లు రహదారి నిర్మాణ పనులకు మంగళవారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాలకు రహదారులు వేయడం ద్వారా విద్య, వైద్యం, తాగునీరు వంటి సౌకర్యాలు అందించడానికి వీలుంటుందన్నారు. ఏజెన్సీలో గిరిజనుల కష్టాలను తీర్చడం ద్వారా గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు మండంగి భూషణ, బిడ్డిక పద్మావతి, సునీత, దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్, ఎల్విన్ పేట సిఐ సత్యనారాయణ, ఎస్సై బిడ్డిక శివప్రసాద్, భద్రగిరి ఐటిడిఎ ఎఇ అప్పారావు తదితరులు ఉన్నారు.

రఘు కుటుంబ సభ్యులను పరామర్శించిన జగదీశ్వరి

టిడిపి సీనియర్ నాయకులు కొనిస మన్మథరావు సోదరుడు విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కొనిస రఘు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించారు. మంగళవారం రఘు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు.

భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - కురుపాం

ఖరీఫ్ సాగు చేసే రైతులంతా ఆయా పంటల్లో వ్యవసాయశాఖ సిఫార్సు మేరకు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుకోవాలని జిల్లా వ్యవసాయ శిక్షణా సమన్వయకర్త ఆర్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బియ్యాలవలస రైతు భరోసా కేంద్రంలో శిక్షణా కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. పంట సాగు చేసే రైతులు భూసారాన్ని రక్షించుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతులు సిఫార్సుకు మించి ఎరువులను వాడకం వల్ల భూసారాన్ని కోల్పోడమే కాకుండా పర్యావరణం కాలుష్యం జరుగుందన్నారు. అనంతరం రైతులకు సాగులో పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు బి.శారద, షణ్ముఖరాజు, నాగేశ్వరరావు, మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్‌లో మంగళవారం వాహనదారులకు ఎస్సై ఎం.రాజేష్ అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలను అరికట్టొచ్చన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలను నడపరాదన్నారు. వాహనాలను తనిఖీ చేసి పత్రాలు లేని వారికి అపరాద రుసుం వేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న ఎరువులు, విత్తనాలు, ప్రోత్సకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఐ.గౌరీశంకరావు అన్నారు. మంగళవారం మొండెంఖల్ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఎరువులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జి.గణపతి, వ్యవసాయ సహాయకులు సాయిప్రభ, రైతులు పాల్గొన్నారు.

15 నుంచి రెండో విడత మలాథియన్ స్ప్రేయింగ్

సీతంపేట : మండలంలో ఈనెల 15 నుంచి ఆగస్టు 2 వరకు రెండో విడత మలాథియన్ ద్రావణం స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 35 గ్రామాల్లో స్ప్రేయింగ్ ఎసిఎం ద్రావణం పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు.

10 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఈనెల 10 నుంచి కౌలు రైతుల రుణ అర్హత కార్డులు పంపిణీకి సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక తహశీల్దార్ కె.జయప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 350 మంది కౌలు రైతులు ఉన్నారని, వీరి నుంచి సంబంధిత విఆర్ఒ, విఎఎ, డిప్యూటీ తహశీల్దార్ దరఖాస్తుల స్వీకరిస్తారని, కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - బలిజిపేట

జిల్లాలో జనసేన బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు బాబు పాలూరు అన్నారు. మంగళవారం కళింగ వైశ్య భవనంలో ఆయన జనసేన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభివృద్ధి పనుల విషయంలో చేస్తున్న ప్రతి ఆలోచనకు పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్త సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు బంకురు పోలినాయుడు, గంట్యాడ గౌరునాయుడు, కుమార్, రమణ, రఘు, ఫకీరునాయుడు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలుగా శ్మశానంలోనే ఒంటరిగా..

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎక్కడి వాడో, ఏ ఊరు నుంచి వచ్చాడో తెలియదు గానీ, గత రెండు నెలలుగా గుమ్మలక్ష్మీపురం శ్మశాన వాటికలోనే ఉంటున్నాడో ఓ వ్యక్తి. కంపు కొట్టేచోట కనీసం పది నిమిషాలు కూడా ఉండలేం. అలాంటిది రెండు నెలలుగా కుళ్లిన వ్యర్థాల మధ్య ఉంటూ అక్కడే పడుకుంటూ కాలం గడుపుతున్నాడు. ఒంటి మీద బట్టలు కూడా లేకుండా ఆదిమ మానవుడిలా ఉన్న వ్యక్తిని ఒక్కసారిగా ఎవరైనా చూస్తే జాలి పడక తప్పదు. మాటలు కూడా రాని వ్యక్తికి అటుగా వెళ్లేవారు ఎవరైనా ఇస్తే తింటాడు. లేదంటే ఆకలితో పస్తులే. మంగళవారం శ్మశాన వాటికకు వెళ్ళిన సందర్భంలో కనిపించిన వ్యక్తిని చూసిన వారంతా అయ్యో పాపం అంటూ జాలిపడ్డారు.

మతిస్థిమితం లేక వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఉల్లిభద్ర వద్ద తోటపల్లి బ్యారేజిలో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గరుగుబిల్లికి చెందిన గొట్టిపల్లి గోవింద (57) బ్యారేజీలోకి దూకి మృతి చెందినట్లు ఎస్ఐ అమ్మన్న రావు తెలిపారు. మృతదేహాన్ని పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది వెలికితీశారు. గోవిందకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పాఠశాలను పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని పనుకుపేట ఎంపిపి పాఠశాలను ఎంఇఒ జి.సూరిదేముడు మంగళవారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, 1,2 తరగతుల విద్యార్థులతో తెలుగు అభినయ గేయాలు పాడించారు. వర్ణమాల చదివించడం, అంకెలు, సంఖ్యలు, కూడికలు, తీసివేతలు చేయించారు. 3,4,5వ తరగతుల విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్ చదివించడం, చతుర్విధ ప్రక్రియలు చేయించడం, విద్యార్థులందరికీ కొత్త పాఠ్యపుస్తకాలు అందిందీ లేనిది అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డయేరియా, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ప్రదీప్ 45 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బరువు, ఎత్తు, రక్తపోటు, మధుమేహ తదితర రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ సేవా సమస్థ ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు.